సాక్షి
వికారాబాద్
శనివారం । 13 । జనవరి । 2024



గంజాయి పట్టివేత

కొందరు స్మగ్లర్లు మత్తు పదార్థాలు, గంజాయి తరలిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.


10లో ▸



సార్.. మమ్మల్ని ఆదుకోండి

సబ్సిడీ గొర్రెల కోసం డీడీలు కట్టించుకున్న గత ప్రభుత్వం జీవాలు పంపిణీ చేయలేదని కాపరులు ఆవేదన వ్యక్తం చేశారు.

10లో ▸



రెండో విడత ఎప్పుడో?

కులవృత్తులను ప్రోత్సహించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 2017–18లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టింది.

11లో ▸

న్యూస్‌రీల్

విద్యారంగాన్ని బలోపేతం చేస్తాం

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్ అర్బన్: విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఆయన నివాసంలో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో విద్యా శాఖకు అవసరమైన నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రత్నం, కోశాధికారి మోయిజ్ ఖాన్, కార్యదర్శులు శశిధర్, పవన్‌కుమార్, కృష్ణవేణి, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లలో విలువైన వస్తువులు ఉంచొద్దు

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: సంక్రాంతి పండుగకు ఊర్లే వారు ఇళ్లల్లో బంగారు, వెండి ఇతర విలువైన వస్తువులు ఉంచరాదని, బ్యాంక్ లాకర్లు లేదా వెంట తీసుకెళ్లాలని ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. తాళం వేసిన ఇళ్లల్లో దొంగలు పడే అవకాశం ఉంటుందని, ఊరికి వెళ్లే సమయంలో పక్కింటి వాళ్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంటి ఆవరణలోనే ద్విచక్ర వాహనాలు, కార్లను పార్కింగ్ చేయాలన్నారు. రోడ్ల పక్కన పార్కింగ్ చేస్తే దొంగలు ఎత్తుకెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. బీరువా తాళాలు ఇంట్లో ఉంచరాదని తెలిపారు. ఊరికి వెళ్లే వారు ఇంట్లో ఒక లైటు వేసి ఉంచాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

వికారాబాద్ అర్బన్: ఇంటర్ వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి ఎస్ శంకర్ సూచించారు. వికారాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ తెలుగు అకాడమీ పుస్తకాలు చదివే విధంగా ప్రోత్సహించాలన్నారు. అకాడమీ పుస్తకాలు చదివే విద్యార్థులే పోటీ పరీక్షల్లో రాణిస్తారనే విషయాన్ని విద్యార్థులకు తెలపాలన్నారు. బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రాబోయే ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలకు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటర్నెట్, సీసీ కెమెరాలు, ప్రింటర్, కంప్యూటర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

మనోవికాసానికి క్రీడలు దోహదం




మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్ రావు

తుర్కయంజాల్: విద్యార్థుల మనోవికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని డీఈఓ సుశీందర్ రావు అన్నారు. తుర్కయంజాల్‌లోని ఇండస్ వ్యాలీ స్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఖేలోత్సవ్ 1.0 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని అన్నా రు. మూడు రోజుల పాటు నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, చైర్మన్ కె. సుధీర్, సెక్రటరీ టి.రాఘవ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

మారనున్న జిల్లా స్వరూపం..!

- 30మండలాలు, ఐదు పూర్తి నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటయ్యే అవకాశం
- సీఎం నోట జిల్లాల పునర్విభజన మాట
- కొడంగల్ కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్
- జిల్లా అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు



వికారాబాద్: జిల్లా భౌగోళిక స్వరూపం తోపాటు రూపురేఖలు మరనుందనే చర్చ ఊపందుకుంది. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముందుగా భౌగోళికంగా మార్పులు, చేర్పులు చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తుండటంతో వికారాబాద్ అభివృద్ధిపై చర్చ మొదలైంది. ఇటీవల సీఎం నోట జిల్లాల పునర్విభజన ఉంటుందనే మాట రావడంతో ఈ చర్చకు తెరలేచింది. సీఎం నియోజకవర్గం కొడంగల్ కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ కూడా ఏర్పాటు కానుందని సమాచారం. ఇందుకోసం రోడ్ మ్యాప్ తయారు చేయాలని అధికారులను సూచన ప్రాయంగా ఆదేశించినట్లు తెలుస్తోంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా శాస్త్రీయత పాటించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఐదు పూర్తి నియోజకవర్గాల పరిధిలోని 30 మండలాలతో కూడిన పెద్ద జిల్లాగా వికారాబాద్ అవతరించనుంది. సొంత జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని నిర్ణయించిన సీఎం ముందుగా భౌగోళికంగా ఈ ప్రాంతాన్ని బలోపేతం చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

ఐదు నియోజకవర్గాలతో జిల్లా..

ప్రస్తుతం తలాతోక లేకుండా ఏర్పాటైన జిల్లాను శాస్త్రీయంగా పునర్విభజన చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. వికారాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేసిన జిల్లాలో తాండూరు, వికారాబాద్ పూర్తి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా రంగారెడ్డి జిల్లా పరిధిలోని చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన ఓ మండలం నవాబుపేటను జిల్లాలో కలిపారు. కొడంగల్ నియోజకవర్గ కేంద్రంతో పాటు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు మన జిల్లాలో ఉండగా మరో నాలుగు మండలాలు నారాయణపేట్ జిల్లాలో కొనసాగుతున్నాయి. మరో వైపు పరిగి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలు ఈ జిల్లాలో ఉండగా రెండు మండలాలు నారాయణపేట్ జిల్లాలో కలిపారు. ఇలా అశాస్త్రీయంగా విభజించిన వికారాబాద్ జిల్లా పునర్విభజన అనివార్యంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, చేవెళ్ల పూర్తి నియోజకవర్గాలను కలుపుతూ వికారాబాద్ కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. జిల్లా ప్రజలు సైతం ఇదే ఆలోచనతో ఉన్నారు. ఇదే జరిగితే ప్రస్తుతం జిల్లాలో ఉన్న 20 మండలాలకు తోడు కొడంగల్ నియోజకవర్గ పరిధిలో ఉండి నారాయణపేట్ జిల్లాలో కొనసాగుతున్న నాలుగు మండలాలు కోస్గీ, మద్దూర్, గుండుమల్, కొత్తపల్లి వికారాబాద్ జిల్లాలో కలుపుతారు. వీటితో పాటు పరిగి నియోజకవర్గానికి చెందిన గండేడ్, మహ్మదాబాద్ మండలాలు, రంగారెడ్డి జిల్లా పరిధిలోని చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన నవాబుపేట మండలం ఇప్పటికే వికారాబాద్‌లో ఉంది. మిగతా నాలుగు మండలాలు శంకర్‌పల్లి, మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్ మండలాలు కూడా వికారాబాద్‌లో కలపాలనే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటికే ఉన్న 20 మండలాలతో పాటు మరో 10 మండలాలు జిల్లాలో చేరనుండటంతో మొత్తం 30 మండలాలతో వికారాబాద్ పెద్ద జిల్లాగా అవతరించనుంది.

అభివృద్ధికి ఊతం

సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత జిల్లా వికారాబాద్‌ను ముందుగా భౌగోళికంగా బలోపేతం చేసి తరువాత అభివృద్ధిపై దృష్టి సారించాలనే నిర్ణయించినట్లు తెలుస్తోంది. అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల మీదుగా హైవే అభివృద్ధి, మహబూబ్‌నగర్ నుంచి పరిగినియోజకవర్గం గండేడ్, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల మీదుగా చించోలి వరకు మరో హైవే పనులు పూర్తి చేయడం, మన్నెగూడ నుంచి వికారాబాద్ అనంతగిరి మీదుగా తాండూరు వరకు నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయటం ద్వారా రాష్ట్ర రాజధానికి కనెక్టివిటీ కూడా పెరగనుంది. ఇదే సమయంలో షాద్‌నగర్ – పరిగి నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయడంతో పాటు శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట మీదుగా మర్పల్లి వరకు రహదారి అభివృద్ధి చేయటం ద్వారా జిల్లా నలుమూలలకు నగరం నుంచి కనెక్టివిటీ పెరిగి అభివృద్ధికి మరింత ఊతమిచ్చేందుకు దోహదం చేయనుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు. జిల్లా మీదుగా రీజనల్ రింగ్ రోడ్డు కూడా వెళ్లనుండటంతో ఆ చుట్టుపక్కల వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుల ఏర్పాటు, స్కిల్ డవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు లాంటి ప్రతిపాదనలు జిల్లా ప్రజలను ఊరిస్తున్నాయి. ఇప్పటికే కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ఏర్పాటు చేయగా, అనంతగిరిని టూరిజం హబ్‌గా డెవలప్ చేయడం, పూడూరులో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు, మోమిన్‌పేటలో మొబిలిటీ వ్యాలీ, నవాబుపేట మండలం ఆర్కతల పరిసరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు లాంటి అభివృద్ధి పనులకు ఇప్పటికే పునాదులు పడిన నేపథ్యంలో జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టనుంది. దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయనే చర్చ జరుగుతోంది.

ఇక కొడంగల్ కేంద్రంగా రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్ కూడా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కనిపిస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

ఓటరు నమోదుకు కృషి చేద్దాం

- రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ శ్రీనివాస్
- 20, 21 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్

తాండూరు టౌన్: కొత్త ఓటర్ల నమోదులో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలని తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పలు పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఫారం – 6 నింపి ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20, 21వ తేదీల్లో ఓటరు నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ రోజుల్లో బూత్ లెవల్ అధికారులు సంబంధిత పోలింగ్ స్టేషన్ల పరిధిలో అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఫారం – 8, మృతి చెందిన, డబుల్ ఓట్లు, శాశ్వత వలస ఓటర్ల పేర్లు తొలగింపునకు ఫారం – 7 నింపి బీఎల్‌ఓలకు ఇవ్వాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ విజయవంతానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు, పౌరులు సహకరించాలని కోరారు. ఈ నెల 6న వెలువడిన ముసాయిదా ఎన్నికల ఓటరు లిస్టును పరిశీలించి అభ్యంతరాలు, సలహాలు తెలియజేయాలన్నారు. అలాగే ఫిబ్రవరి 8వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్లు తారాసింగ్, మసీరుద్దీన్, వెంకటస్వామి, ఏఓ మహేష్ గౌడ్, డీటీ విజయేందర్, చాంద్‌పాషా, ఆర్ఐ బాల్‌రాజు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పెద్దేముల్: చెంచుల సంక్షేమం తోపాటు వారు నివసించే కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చైతన్యనగర్ చెంచు కాలనీలో పలు శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 15న పీఎం జన్‌మాన్ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇప్పటి వరకు చైతన్యనగర్‌లో జరిగిన పనులను రెవెన్యూ, విద్యుత్, వైద్య, అటవీ, బ్యాంక్, తాగు నీటి సరఫరాపై సమీక్షించారు. ప్రధాని మోదీ ఈ నెల 15న ప్రజలను ఉద్దేశించి మాట్లాడే అవకాశం ఉన్నందున 24గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని ఈ శాఖ అధికారులకు ఆదేశించారు. పీఎం జన్‌మాన్ కార్యక్రమం ద్వారా ప్రతి లబ్ధిదారుడికి లాభం చేకురుతుందన్నారు. ఆధార్, ఇంటింటికి నల్లా, బ్యాంకు ఖాతాలు, విద్యుత్ కనెక్షన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందచేయడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అవసరం ఉన్నా తమ దృష్టికి తేవాలని సూచించారు. అందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, స్థానిక సర్పంచ్ లలిత, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఇందిర, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, మిషన్ భగీరథ ఈఈ రాంబాబు, జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, తహసీల్దార్ కిషన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి తోపాటు పలు మండలాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లింగ్యానాయక్



చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న దాతలు

అభాగ్యులకు అండగా ఉంటాం

- డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్
- అనాథ పిల్లలకు దుస్తులు, పండుగ సామగ్రి పంపిణీ

కొడంగల్: అనాథ పిల్లలకు అండగా ఉంటామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సిద్ధార్థ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరుగురు అనాథ పిల్లలకు దుస్తులు, పండుగ సామగ్రి, నగదు పంపిణీ చేశారు. డాక్టర్ రవీంద్రయాదవ్ తనవంతు సాయంగా రూ.20వేల నగదు అందజేశారు. శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానంద జీవితం ఆదర్శమన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని కోరారు. యువత చెడు మార్గంలో వెళ్లకుండా సమాజానికి ఉపయోగపడాలన్నారు. టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడు మాట్లాడుతూ.. తల్లిదండ్రులను కోల్పోయి.. ఆదుకునే వారు లేని వారికి తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో అండగా ఉంటుందన్నారు. మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామానికి చెందిన గణేష్, పూజ, శ్రావణి, రాజు, కొడంగల్‌కు చెందిన సాహితి, రోహిత్‌లకు దుస్తులు, కిరాణా సామగ్రి, నగదు అందజేసినట్లు చెప్పారు. వికారాబాద్ జిల్లాలో ఉన్న మహా శారద ఆసుపత్రి డాక్టర్ రాజశేఖర్ సహకారంతో ఇమ్యునిటీ పవర్ పెంచుకోడానికి హోమియో మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి కొడంగల్ ప్రధాన కార్యదర్శి ఆనంద్, కన్వీనర్ గౌరారం గోపాల్, తాండూరు మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షుడు కేవీఎం వెంకట్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ సిటీగా ఇబ్రహీంపట్నం

సౌత్ రీజియన్‌లో 5వ ర్యాంక్

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని క్లీన్ సిటీగా గుర్తిస్తూ సర్టిఫికేషన్ ప్రకటించింది. స్వచ్ఛ సర్వేక్షణ్–2023 కింద కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా రీజియన్‌లో పరిధిలో చేపట్టిన స్వచ్ఛ సిటీ కోసం 326 మున్సిపాలిటీలు పోటీపడ్డాయి. అందులో 5,096 మార్కులు.. 5వ ర్యాంక్‌తో బెస్ట్ క్లీన్ సిటీగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ నిలిచింది. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం.. చెత్తాచెదారం లేకుండా పారిశుద్ధ్య మెరుగు కోసం చేపట్టిన చర్యలు.. ఇంటింటికీ తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిత్యం డంపింగ్ యార్డుకు తరలించడం.. రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం.. మురికి కాలువలు, నాలాలను క్లీన్‌గా ఉంచడం.. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం తదితర కార్యక్రమాలతో పట్నం మున్సిపాలిటీ ముందు వరుసలో నిలిచింది. వీటిన్నింటినీ పరిగణలోకి తీసుకొని కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ సర్టిఫికెట్ జారీ చేసింది.

పెర'గని' ఆదాయం..!

- యథేచ్ఛగా సుద్ద అక్రమ తవ్వకాలు
- లీజు, రాయల్టీ చెల్లించకుండా సుద్ద, ఎర్రమట్టి రవాణా
- ప్రభుత్వ ఖజానాకు భారీ గండి
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ శాఖలు
- గ్రామాల ప్రగతికి అవరోధం



కోటపల్లి మండల శివారులో సుద్ద తవ్వకాల కారణంగా ఏర్పడిన పెద్ద గుంత

పెద్దేముల్: పాలకులు మారినా.. ప్రభుత్వాలు మారినా జిల్లాలో సుద్ద అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. చిన్న తరహా ఖనిజాల పరిధిలోకి వచ్చే సుద్ద తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జిల్లాలో సుద్ద, నాపరాతి, ఎర్రమట్టి నిక్షేపాలు భారీగా ఉన్నాయి. పెద్దేముల్, ధారూరు, మోమిన్‌పేట, కోటపల్లి మండలాల్లో వందలాది ఎకరాల్లో సుద్ద గనులు విస్తరించి ఉన్నాయి. వ్యాపారులు పగటిపూట యంత్రాల సాయంతో ముడి సుద్దను వెలికితీసి టిప్పర్లు, లారీల్లో పొలాల్లో నిల్వ చేస్తున్నారు. పరిశ్రమల నుంచి ఆర్డర్లు రాగానే తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మంది వ్యాపారులు గనుల లీజు కోసం ఎదురు చూస్తుండగా మరి కొంత మంది అక్రమ మార్గంలో తవ్వకాలు సాగిస్తున్నారు. అయినా మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. రెండేళ్ల క్రితం రుద్రారం, గోపాల్‌పూర్ గ్రామాల్లో సుద్ద అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ చర్యలు మాత్రం శూన్యం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సుద్ద తవ్వకాల కోసం రెవెన్యూ కార్యాలయం నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలి. ఆ తరువాత ఆన్‌లైన్‌లో మైన్స్ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. లీజు అనుమతులు పొందిన తరువాత తవ్వకాలు జరపాలి. కానీ ఈ పద్ధతి ఎక్కడా అమలు కావడం లేదు. అలాగే వెలికి తీసిన ప్రతి టన్ను సుద్దకు రూ.206 చొప్పున రాయల్టీ చెల్లించాలి. చాలా మంది వ్యాపారులు రాయల్టీ చెల్లించకుండా ముడి సుద్దను పరిశ్రమలకు తరలిస్తున్నారు. కొంత మంది తూతూ మంత్రంగా రాయల్టీ చెల్లించి జేబులు నింపుకొంటున్నారు. దీంతో గనుల శాఖ భారీ ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది.

నిబంధనలకు నీళ్లు

యథేచ్ఛగా సుద్ద అక్రమ తవ్వకాలు చేస్తుండటంతో గనుల శాఖ ఏటా ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న గనుల నుంచి ఆ శాఖకు 2019 – 20 సంవత్సరంలో రూ.85 కోట్లు, 2020 – 21లో రూ.75.05 కోట్ల ఆదాయం సమకూరింది. రెండేళ్ల నుంచి భారీగా సుద్ద తవ్వకాలు జరుగుతున్నా ప్రభుత్వ ఆదాయం పెరగడం లేదు. గతంలో మారేపల్లి, రుద్రారం, గోపాల్‌పూర్, తింసాన్‌పల్లి, జనగాం తోపాటు పలు మండలాల్లో అక్రమ మైనింగ్ చేశారన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే గనుల శాఖ నిబంధనల ప్రకారం అక్రమ మైనింగ్ చేస్తే పది రెట్లు జరిమానా విధించాలి. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్కరిపై కూడా ఆ తరహా చర్యలు తీసుకోలేదు. తాండూరు నియోజకవర్గంలో సుద్ద, ఇసుక, ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కానీ వారు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లీజు తీసుకున్న సర్వే నంబర్ భూమిలోనే తవ్వకాలు చేయాలి. కానీ కొంత మంది లీజు లేని చోట తవ్వకాలు చేస్తున్నారు. మరి కొంత మంది ఒక ఎకరా లీజుకు తీసుకొని రెండు నుంచి మూడు ఎకరాల్లో సుద్ద తవ్వకాలు నిర్వహిస్తున్నారు.

ఖనిజ నిక్షేపాలున్న ప్రాంతాలు

జిల్లాలోని పెద్దేముల్, బంట్వారం, కోటపల్లి, మోమిన్‌పేట్, ధారూరు మండలాల్లో సుద్ద నిక్షేపాలు ఉన్నాయి. ఒక్కో గని విస్తీర్ణం ఎకరం నుంచి 5 ఎకరాల వరకు ఉంటుంది. లీజు కాలం 10 సంవత్సరాలు. ప్రతి రోజూ వందల టన్నుల సుద్దను వెలికి తీస్తున్నారు. పదేళ్ల వ్యవధిలో వెయాల్సిన సుద్దను కేవలం నెలల వ్యవధిలో తరలిస్తున్నారు. పది టన్నుల సామర్థ్యం ఉన్న లారీల్లో 25 నుంచి 30 టన్నుల వరకు తరలిస్తున్నారు. మూడేళ్ల నుంచి ప్రభుత్వం లీజు ఇవ్వడం లేదు. అయినా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. కట్టడి చేయాల్సిన మైనింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు.

తవ్వకాలు జరిపితే చర్యలు



ప్రభుత్వ అనుమతులు పొందిన తరువాతే సుద్ద, ఎర్రమట్టి, రాయి తవ్వకాలు చేసుకోవచ్చు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు లీజు కోసం దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తాం.

– కిషన్, తహసీల్దార్, పెద్దేముల్

లైసెన్సులు రద్దు చేస్తాం



పరిశ్రమల యజమానులు అక్రమంగా సుద్దను కొనుగోలు చేస్తే వారి లైసెన్సులను రద్దు చేస్తాం. లీజు పొందిన వారు సుద్ద నిల్వ చేసిన ప్రాంతంలో యజమాని పేరు, సర్వే నంబరు బోర్డు పెట్టాలి. రాయల్టీ చెల్లించిన తరువాతే సుద్దను తరలించాలి.

– శామ్యూల్ జాకబ్, మైన్స్ శాఖ ఏడీ

క్లుప్తంగా

పోలీసుల అదుపులో దొంగలు

మొద్గుల: మండల పరిధి అందుగుల గ్రామంలో ఆరు రోజుల క్రితం ట్రాక్టర్ ట్రాలీని తరలించుకు పోయిన గుర్తు తెలియని దుండగులను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. ట్రాలీ యజమాని ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో దొంగల కోసం పోలీసులు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా.. గతంలోనూ ట్రాక్టర్ ట్రాలీలను దొంగిలించినట్లుగా దుండగులు ఒప్పుకున్నట్లు తెలిసింది. చోరీలకు సంబంధించిన వివరాలను శనివారం (నేడు) వెల్లడించనున్నట్లు సమాచారం.

గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జిగా అడిషనల్ కలెక్టర్



బాధ్యతలు చేపట్టిన అడిషనల్ కలెక్టర్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం 32 మంది గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లను తొలగించిన నేపథ్యంలో.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ఆ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం సంస్థ కార్యదర్శి సురేష్‌తో లైబ్రరీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. పాఠకులకు అందుతున్న మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్: బ్రహ్మకుమారీస్ ఓం శాంతి వికారాబాద్ కార్యాలయానికి చెందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్‌లు ఆవిష్కరించారు. కొత్త ఏడాదిలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండి రైతులకు లాభాలు రావాలని బ్రహ్మకుమారీస్ మధు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు క్యాలెండర్, డైరీలను అందజేశారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్



పోలీస్ స్టేషన్‌లో ట్రాక్టర్

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేసిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారు జామున చాపలగూడెం గ్రామశివారులో కామునిపల్లి గ్రామానికి చెందిన బాలు అనే వ్యక్తి ఇసుక తరలిస్తూ.. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు తారసపడ్డాడు. దీంతో పోలీసులు వాహనాన్ని ఆపి, ఇసుక తరలింపునకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా లేవని సమాధానం చెప్పాడు. దీంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

కేశంపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో కేశంపేట ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. చదువైనా, ఆటలైనా యువతను భవిష్యత్తు బాటలో నడిపిస్తాయని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆటల వలన శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

కొందుర్గు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుంజల్‌పహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొప్పెర సుశీల ఈ నెల 5న ఇంటికి తాళం వేసి తన పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లింది. తిరిగి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఇంటికి చేరుకుంది. ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన ఆమె.. ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువా తాళం తొలగించి, మూడు తులాల బంగారు, 40 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.9 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. వెంటనే బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సక్రమ్ తెలిపారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత

- పక్కా సమాచారంతో రైలులో సోదాలు
- 77 కిలోల గంజాయి స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, అదుపులో నిందితులు

అనంతగిరి: మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినా.. కొందరు స్మగ్లర్లు మత్తు పదార్థాలను తరలిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తాజాగా ఓ ముఠా కొత్త మార్గాన్ని ఎన్నుకొని, పోలీసుల కన్నుగప్పి గంజాయి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా.. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు.. ఆ ముఠా గుట్టును రట్టు చేశారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది.

బెడ్ షీట్‌లో గంజాయిని దాచి..

ఒడిస్సా భువనేశ్వర్ నుంచి ముంబాయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్త చర్యలు తీసుకున్నారు. నిబంధనల ప్రకారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు వికారాబాద్ జంక్షన్‌లో స్టాప్ లేదు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో వికారాబాద్ జంక్షన్‌కు చేరుకున్న సమయంలో రైల్వే అధికారుల అనుమతితో పోలీసులు రైలును ఆపి సోదాలు నిర్వహించారు. ఒడిశాలోని గణపతి జిల్లాకు చెందిన నలుగురు వ్యక్తులు లడ్విన్ ఆనంద్, మున్నా వర్ధన్, లజిత్ రాయ్, స్వామియల్‌లు ఏసీ బోగిలో రిజర్వేషన్ చేసుకొని ప్రయాణిస్తున్నారు. వారికి కేటాయించిన సీటులో 77 కిలోల గంజాయిని ఎవరికీ అనుమానం రాకుండా భద్రపర్చారు. విస్తృత సోదాల్లో బెర్త్‌పై ఉన్న బెడ్ షీట్‌లో గంజాయి దాచినట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.20లక్షలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ సీఐలు రాఘవీణ, ధన్వంత్ రెడ్డి, ఆర్‌పీఐ సీఐ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐలు ఈశ్వర్ రావు, సిబ్బంది విష్ణు, హన్మంత్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోండి..

కడా ప్రత్యేక అధికారికి 1998 డీఎస్సీ అభ్యర్థుల వినతి

కొడంగల్ రూరల్: డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని యూనియన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన 1998 డీఎస్సీలో ఉపాధ్యాయ నియామకాల్లో అధికారులు అవకతవకలకు పాల్పడి, తమకు అన్యాయం చేశారని ఆరోపించారు. నాటి నుంచి న్యాయపోరాటం చేస్తున్నామని, ట్రిబ్యునల్, హైకోర్టు, సుప్రీంకోర్టులో విజయం సాధించినా గత ప్రభుత్వం, అధికారులు తమకు ఉద్యోగాలు కల్పించలేక పోయారని వాపోయారు.

మాట నిలుపుకోని కేసీఆర్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగాలు కల్పిస్తామని అసెంబ్లీ సాక్షిగా, బహిరంగ సభల్లో హామీలు ఇచ్చారని, ప్రగతిభవన్‌కు సైతం పిలిపించుకొని భరోసా కల్పించారని, కానీ మాట నిలుపుకోలేదని అభ్యర్థులు విమర్శించారు. పక్కరాష్ట్రం ఏపీలో అక్కడి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి.. నాటి అభ్యర్థులు 4,567మందికి ఎంటీఎస్ పద్ధతిలో (జీఓ ఎంఎస్ నంబర్ 27, మార్చి 15, 2023)ద్వారా ఉద్యోగాలు ఇచ్చి ఆదుకున్నారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగాలు కల్పించాలని అభ్యర్థులు కోరారు. కార్యక్రమంలో యూనియన్ అభ్యర్థులు శైలకుమారి, ఎస్.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అసభ్య ప్రవర్తన

పహాడీషరీఫ్: ఆరేళ్ల చిన్నారిపై సవతి తండ్రి అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి గ్రామానికి చెందిన దంపతులకు ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల కుమార్తె ఉంది. కొంత కాలం క్రితం కుటుంబ కలహాలతో దంపతులు విడిపోగా.. బాలిక తల్లి వద్దే ఉంటుంది. సదరు గృహిణి భర్తతో విడిపోయిన అనంతరం ఆటో డ్రైవర్‌ను రెండో వివాహం చేసుకుంది. రెండో భర్తతో ఆమెకు ఇద్దరు పిల్లల సంతానం కలిగింది. కాగా మొదటి భర్తకు పుట్టిన కూతురుపై వారం రోజులుగా.. భార్య ఇంట్లో లేని సమయంలో తండ్రి స్థానంలో ఉన్న వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. ఇది గమనించిన మరో కుమార్తె తల్లికి చెప్పడంతో, ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సార్.. మమ్మల్ని ఆదుకోండి

- డీడీలు కట్టి నెలలు గడుస్తున్నా.. యూనిట్ల ఊసేలేదు
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని విన్నవించిన గొర్ల కాపరులు
- న్యాయం చేస్తానని హామీఇచ్చిన బీఎమ్మార్



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో మాట్లాడుతున్న కాపరులు

తాండూరు రూరల్: గత ప్రభుత్వం సబ్సిడీతో గొర్రెలు ఇస్తామని చెప్పి డీడీలు కట్టించుకుందని, కానీ ఇప్పటి వరకు తమకు యూనిట్లు అందలేదని కాపరులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తాండూరు మండలం చెంగోల్ గ్రామంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొని, తిరిగి వెళ్తున్న క్రమంలో 50 మంది గొర్ల కాపరులు ఎమ్మెల్యేను కలిసి జీవాల గురించి మొరపెట్టుకున్నారు. డీడీలు తీసి నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు గొర్రెలు ఇవ్వలేదని వాపోయారు. అధికారులను అడిగితే వారు స్పందించడం లేదని ఆరోపించారు. స్పందించిన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం.. యూనిట్లను ఇస్తామని చెప్పి, గొర్ల కాపరుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా డీడీలు కట్టించుకోని మోసం చేసిందని విమర్శించారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్.. రూ.వేల కోట్లు అప్పు చేసి.. రాష్ట్రాన్ని దివాల తీశారని ఎద్దేవా చేశారు. మీ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నెల రోజుల్లో అన్నీ సద్దుకుంటాయని, ప్రజలకు అంతా మంచే జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట చెంగోల్ ఎంపీటీసీ రత్నామాల, నాయకులు రాము యాదవ్, బ్రహ్మానందరెడ్డి తదితరులు ఉన్నారు.

కొడంగల్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

- ప్రతి ఒక్కరూ సహకరించాలి
- అవకాశాన్ని వినియోగించుకోండి
- కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్: మున్సిపాలిటీ పరిధి గ్రామాల అభివృద్ధికి సహకరించి, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహిళా సమాఖ్యలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులతో అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులు, తీసుకోవాల్సిన నిర్ణయాల గురించి చర్చించగా.. ఇందులో సదరు నేతలు వారివారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకెళ్లడానికి అధిక మొత్తంలో నిధులు మంజూరు చేయనున్నారని, అభివృద్ధి బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, విద్యా వైద్యం రవాణా సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ ప్రభుత్వ స్థలాలను గుర్తించి, యువతకు ఉపాధి కల్పించేందుకు వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయంతో పాటు 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి పెంచి, వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ యూసుఫ్, నందారం ప్రశాంత్, కృష్ణంరాజు, బీజేపీ నాయకుడు పున్నం చంద్ లాహోటీ, సీపీఐ నాయకుడు ఇందనూర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎన్నికలప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత అందరికీ ప్రాధాన్యత
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

యాచారం: అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి సేవ చేస్తానని, ఎన్నికలప్పుడే రాజకీయాలు, ఆ తర్వాత అందరికీ ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సాయంత్రం 20 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో గొప్పలకు పోయి.. అధిక అప్పులు తెచ్చి, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. నేడు ఏ శాఖలో కూడా నిధులు లేక ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక వనరులను గాడిలో పెడతారని తెలిపారు. ఇబ్రహీంపట్నంకు అధిక నిధులు తెచ్చి, వెనుకబడిన గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. బీఆర్ఎస్ సర్కార్‌లో.. ఆ పార్టీకి చెందిన వారికే సంక్షేమ పథకాలు అందేవని, కాంగ్రెస్ హయాంలో అర్హులకు న్యాయం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిలో పైరవీలు ఉండవన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, వైస్ ఎంపీపీ శ్రీనువాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరామర్శించారు. రామకృష్ణ తండ్రి ఎట్టయ్య వారం క్రితం మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. గునుగల్ గ్రామానికి వెళ్లి రామకృష్ణను పరామర్శించారు.

శ్మశానవాటిక కబ్జా



కబ్జాచేసి కడీలు పాతిన స్థలం ఇదే

ధారూరు: శ్మశానవాటిక కబ్జా చేసిన వ్యక్తిపై ముదిరాజ్ సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని మందగడ్డ కాలనీ సమీపంలో బీసీలకు చెందిన శ్మశాన వాటిక ఉంది. దాని పక్కనే ఉన్న భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి, శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకున్నారు. చుట్టూ కడీలు పాతించారు. దీనిపై సంఘం నాయకులు లింగనపల్లి అశోక్, రాంనారాయణ తదితరులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్.. సర్వే కోసం సర్వేయర్ రమేశ్‌ను పంపించారు. పరిశీలించిన సర్వేయర్.. శ్మశాన వాటిక స్థలం కొంతభాగం కబ్జాకు గురైనట్లు గుర్తించారు. చుట్టూ పాతిన కడీలను వెంటనే తొలగించాలని పక్క భూమి యజమానిని సర్వేయర్ ఆదేశించారు.

కారును ఢీకొన్న సిమెంట్ ట్యాంకర్



దెబ్బతిన్న కారు

పెద్దేముల్: కారును వెనుక నుంచి సిమెంట్ ట్యాంకర్ ఢీ కొన్న సంఘటన శుక్రవారం పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి తాండూరు వైపు కారు వెళ్తోంది. దాని వెనకాలే ట్యాంకర్ కూడా వస్తోంది. ఈ క్రమంలో పెద్దేముల్ మండలం మన్సాన్‌పల్లి–మంబాపూర్ మధ్యన కారును వెనుక నుంచి ట్యాంకర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు వెనుక భాగం పూర్తిగా దెబ్బతినగా.. అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. కారు యజమాని ఫిర్యాదు మేరకు ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

షాద్‌నగర్ రూరల్: చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఐ రాంరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన మహ్మద్ జావిద్, బాబానగర్‌కు చెందిన సయ్యద్ ఆసిఫ్‌లు షాద్‌నగర్ ప్రాంతంలో కొంత కాలంగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. నిందితులను శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సాగు వివరాలను నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



వరి సాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

కొడంగల్ రూరల్: తాము సాగుచేస్తున్న పంట వివరాలను వ్యవసాయ అధికారులకు తెలిపి, ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధి పెద్దనందిగామ గ్రామంలో ఆయన పర్యటించారు. శివారులోని పంటల పొలాలను పరిశీలించారు. పంటల వివరాలను యాప్‌లో నమోదుచేశారు. ఈ సందర్భంగా ఆయన వరి నారుమడి పెంపకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే రాయితీలు, ఇతర ప్రయోజనాలతో పాటు విపత్కర పరిస్థితుల్లో నష్ట పరిహారం పొందేందుకు పంటల వివరాలను వ్యవసాయ అధికారులకు చెప్పి నమోదు చేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ జి.పావని, రైతులు పాల్గొన్నారు.

హోమో సెక్స్‌కు ఒత్తిడి చేస్తున్నాడనే..



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునితా రెడ్డి

- వేధింపులు, బెదిరింపులు తట్టుకోలేకే స్నేహితుల దురాగతం
- రౌడీషీటర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్
- కేసు వివరాలు వెల్లడించిన పోలీసులు

పహాడీషరీఫ్: రౌడీషీటర్‌ను హత్యచేసిన సంఘటనలో 24 గంటల్లోనే ఎనిమిది మంది నిందితులను బాలాపూర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. తుక్కుగూడలోని తన కార్యాలయంలో శుక్రవారం మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. కొత్తపేట అబుబకర్ కాలనీకి చెందిన బాలాపూర్ రౌడీషీటర్ ముబారక్ సిగార్‌ను, బుధవారం అర్ధరాత్రి దుండుగులు దారుణంగా కత్తులతో పొడిచి హత్య చేసిన విషయం తెలిసిందే. ముబారక్‌కు షాహిన్‌నగర్ క్యూబా కాలనీకి చెందిన రౌడీషీటర్ షేక్ ఇస్మాయిల్ అలియాస్ ఆదిల్(27) స్నేహితుడు. ఆదిల్‌కు మరో రౌడీషీటర్ షేక్ అమీర్(26)లతో పాటు నసీర్(23), షేక్ హుస్సేన్(22), అబ్దుల్ ఫరీద్ ఖాన్(20), ఖాజా(20), రాజేంద్రనగర్‌కు చెందిన సయ్యద్ ఇలియాస్(23), షాహిన్‌నగర్‌కు చెందిన సమీర్(21)లుగా ఉన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 7న క్యూబా కాలనీలో షేక్ జమీర్, ఖాజాలు నిలబడి ఉండగా.. వారి వద్దకు వచ్చిన ముబారక్ ఖాజా వద్ద నుంచి బలవంతంగా రెండు సెల్‌ఫోన్లను లాక్కున్నాడు. అదే రోజు సాయంత్రం అమీర్ ముబారక్ నుంచి ఫోన్లను ఇప్పించాడు. ఇతనితో పాటు మిగిలిన స్నేహితుల నుంచి కూడా ఇదే మాదిరిగా డబ్బులు, ఫోన్‌లు, బైక్‌లు కూడా లాక్కోవడంతో పాటు హోమో సెక్స్ చేయాలని బెదిరింపులకు పాల్పడేవాడు. అమీర్ అడగడంతో బైక్‌లు మాత్రమే ఇచ్చిన ముబారక్.. ఫోన్లు, నగదు ఇవ్వకపోవడం.. తరచూ వేధింపులకు పాల్పడుతుండడంతో ఇతన్ని ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. సాధారణంగానే ఈ నెల 10న రాత్రి వాదే ముస్తఫాకు ముబారక్ చేరుకోవడం.. అదే సమయంలో నిందితులు కూడా అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నెలకొన్న వివాదంలో మాటామాట పెరిగి ముబారక్ సిగర్‌ను కత్తులతో పొడిచి చంపారు. మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాస్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ జంగయ్య తదితరులు వివరాలు వెల్లడించారు.

క్రీడల్లో మెరిసిన చేవెళ్ల విద్యార్థినులు

విజేతలను అభినందించిన అధ్యాపక బృందం



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

మొయినాబాద్ రూరల్: రాష్ట్ర స్థాయి పోటీల్లో సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థినులు విజయం సాధించడం ఆనందంగా ఉందని పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. రెండు రోజులుగా ఘట్‌కేసర్‌లోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఈగ్నైట్ ఫెస్ట్‌లో.. రాష్ట్రంలోని అన్ని గురుకులాల 1,600 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ టోర్నీలో చేవెళ్ల గురుకుల విద్యార్థినులు స్పెల్‌బీ మణిదీప్తి (8వ తరగతి) ద్వితీయ స్థానంలో నిలిచి రూ.7,500 నగదు బహుమతి పొందారు. ఉపన్యాస పోటీల్లో కె.సాహితి(6వ తరగతి) తృతీయ స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు అందుకున్నారు. ముఖాముఖి చర్చలో అస్రిత(ఇంటర్ మొదటి సంవత్సరం) తృతీయ స్థాయిలో రూ.5 వేలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమాదేవి విజేతలను రాష్ట్ర గురుకులాల కార్యదర్శి నవీన్‌కోలాస్, జాయింట్ సెక్రటరీ శారదా, డిప్యూటీ సెక్రటరీ వెంకటలక్ష్మి, వెస్ట్ రిజియన్ ఆర్‌సీఓ డాక్టర్ శారద కలిసి అభినందించారు. రాష్ట్రంలోనే చేవెళ్ల పాఠశాల పేరు ప్రఖ్యాతులు సాధించడం అభినందనీయమని పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి శారద కొనియాడారు. ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.

రాయితీ సిలిండర్లు పక్కదారి!



సిలిండర్లను తరలించే వాహనాలను తనిఖీ చేస్తున్న డీటీ

ఇబ్రహీంపట్నం: రాయితీ సిలిండర్లను గృహ వినియోగదారులకు అందించకుండా.. సరఫరా వాహనదారులు వాటిని పక్కదారి పట్టించి, సొమ్ము చేసుకుంటున్నారని పౌర సరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో హోటళ్లకు సరఫరా అవుతున్న గ్యాస్ బండలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడారు. హోటళ్లలో వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్లనే వాడాలని సూచించారు. అక్రమాలకు చెక్ పెట్టేందుకు అన్ని కోణాల్లో విచారణ చేపట్టామని, అందులో భాగంగానే గ్యాస్ ఏజెన్సీల్లో ఎన్ని కనెక్షన్లు ఉన్నాయనే సమాచారం సేకరిస్తున్నట్లు వెల్లడించారు. గృహ వినియోగ బండలు రూ.వెయ్యి లోపే లభిస్తుండటంతో కొందరు వ్యాపారులు, కొంత ఎక్కువ మొత్తం చెల్లించి, వాటిని వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. సబ్సిడీ సిలిండర్లను వినియోగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు కేంద్రం నుంచి ఆహ్వానం అందుకున్న శంకరస్వామీజీని కలిసిన వీహెచ్‌పీ నాయకులు - బషీరాబాద్